## 'ముక్కోటి' ఆదాయ వ్యయం



భద్రాచలం, డిసెంబర్ 29 : భద్రాచలం సీతారామచంద్ర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించిన ముక్కోటి ఏకాదశి అధ్యయనోత్సవాలకు దేవస్థానం రూ.1.22 కోట్లను వెచ్చించగా.. రూ.67,31,342 ఆదాయం వచ్చిందని దేవస్థానం అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. సెక్టార్ టికెట్ల ద్వారా రూ.32,79,750, రూ.2 వేల పరోక్ష సేవ టికెట్ల ద్వారా రూ.26 వేలు, రూ.వెయ్యి పరోక్ష టికెట్ల ద్వారా రూ.12 వేలు, స్పెషల్ దర్శనం టికెట్ల ద్వారా రూ.2,72,600, స్పెషల్ దర్శనంతోపాటు ఇతర సేవల ద్వారా రూ.4,10,534 ఆదాయం వచ్చిందని అధికారులు పేర్కొన్నారు. అలాగే చిన్న లడ్డూ ప్రసాదాల విక్రయం ద్వారా రూ.22,56,450, మహా లడ్డూ ప్రసాదం విక్రయం ద్వారా రూ.2.50 లక్షలు, కాటేజీల ద్వారా రూ.2,24,008 ఆదాయం వచ్చిందని వారు పేర్కొన్నారు.

# రెండవరోజూ 'ప్రజాపాలన' సభలు



దరఖాస్తులు అందించేందుకు భారీగా క్యూ కట్టిన ప్రజలు



దరఖాస్తులను పరిశీలిస్తున్న ఉమ్మడి జిల్లా నోడల్ ఆఫీసర్ రఘునందన్‌రావు, చిత్రంలో కలెక్టర్ వీపీ గౌతమ్

ఖమ్మం, డిసెంబర్ 29 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఉమ్మడి ఖమ్మం జిల్లావ్యాప్తంగా రెండురోజు శుక్రవారమూ ప్రజాపాలన గ్రామ సభలు జరిగాయి. అధికారులు 21 మండలాల పరిధిలోని 84 గ్రామాల్లో సభలు నిర్వహించారు. ప్రజాపాలన దరఖాస్తుల్లో రేషన్ కార్డు ఆప్షన్ లేదని, తాము కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలనుకుంటున్నామని ఎక్కువ మంది నిరాశకు లోనయ్యారు. కాగా ఖమ్మం నగరంలోని 3వ డివిజన్‌తోపాటు కూసుమంచి మండలం గైగొళ్లపల్లిలో జరిగిన గ్రామసభలను ప్రజాపాలన

### నూతన రేషన్‌కార్డులపై ఆరా తీసిన ప్రజలు
### దరఖాస్తులో ఆప్షన్ లేదని నిరాశ

ఉమ్మడి జిల్లా నోడల్ ఆఫీసర్ రఘునందరావు, ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్ పరిశీలించారు. ఖమ్మం రూరల్ మండలంలో నిర్వహించిన గ్రామసభలను స్పెషల్ ఆఫీసర్ బీ జ్యోతి పర్యవేక్షించారు. సత్తుపల్లి పట్టణంలో నిర్వహించిన సభల్లో ఎమ్మెల్యే మట్టా రాగమయి, మున్సిపల్ చైర్మన్ కూసంపుడి మహేశ్ పాల్గొన్నారు. వైరా పట్టణంలో నిర్వహించిన గ్రామసభలకు ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్, కల్లూరు మండలం చిన్నమల్లెల గ్రామ సభలో ఆర్డీవో అశోకచక్రవర్తి, భద్రాద్రి జిల్లా దమ్మపేట మండలంలోని లింగాలపల్లి మొద్దులగూడెం, మారెప్పగూడెం గ్రామసభలకు ఎమ్మెల్యే ఆదినారాయణ, టేకులపల్లి మండలం ముత్యాలపాడు క్రాస్‌రోడ్ గ్రామసభలకు అదనపు కలెక్టర్ రాంబాబు, ఇదే మండలం బిల్లుడుతండా గ్రామసభకు ఎమ్మెల్యే కోరం కనకయ్య హాజరయ్యారు. వీరితో పాటు గ్రామస్థాయిలో ఎంపీపీలు, జడ్పీటీసీలు, సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు గ్రామసభలను పర్యవేక్షించారు.

### 'ప్రజాపాలన' దరఖాస్తులతో
## ఆరు గ్యారెంటీల లబ్ధి

**ఒక కుటుంబానికి ఒక దరఖాస్తు చాలు**

**వచ్చే నెల ఆరు వరకు ఎప్పుడైనా పంచాయతీ కార్యదర్శికి ఇవ్వొచ్చు..**

**ఉమ్మడి జిల్లా నోడల్ ఆఫీసర్ రఘునందనరావు**



కూసుమంచి : గైగొళ్లపల్లి గ్రామసభలో మాట్లాడుతున్న ఉమ్మడి జిల్లా నోడల్ ఆఫీసర్ రఘునందన్‌రావు పక్కన కలెక్టర్ గౌతమ్

కూసుమంచి, డిసెంబర్ 29 : 'ప్రజాపాలన' దరఖాస్తుల ద్వారానే ఆరు గ్యారెంటీలు చేరవవుతాయని ప్రజాపాలన ఉమ్మడి జిల్లా నోడల్ ఆఫీసర్ రఘునందన్‌రావు అన్నారు. ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్‌తో కలిసి గైగొళ్లపల్లిలో శుక్రవారం నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. సత్వరం ఆరు గ్యారెంటీలను అమలు చేసేందుకే రాష్ట్ర ప్రభుత్వం దరఖాస్తులు స్వీకరిస్తున్నదన్నారు. వచ్చే నెల 6 లోపు ఒక కుటుంబం నుంచి ఒక దరఖాస్తును పంచాయతీ కార్యదర్శికి ఇస్తే చాలన్నారు. ఆధార్, రేషన్ కార్డు జత చేస్తే సరిపోతుందన్నారు. ఆదాయం, కుల ధ్రువీకరణ పత్రాలు అవసరం లేదన్నారు. ప్రజాపాలన లక్ష్యం నెరవేరాలంటే అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని, ప్రజల నుంచి ప్రతి దరఖాస్తును తీసుకుని రశీదు ఇవ్వాలని కలెక్టర్ వీపీ గౌతమ్ ఆదేశించారు. ఒక కుటుంబానికి ఒక దరఖాస్తు సరిపోతుందన్నారు. అధికారులు ఆరు రోజుల పాటు దరఖాస్తులను స్వీకరిస్తారన్నారు. ఒక్క దరఖాస్తుకు ఆరు పథకాలూ వర్తిస్తాయన్నారు. రేషన్‌కార్డు లేకపోయినా పథకాల కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ప్రతి గ్రామసభ వద్ద హెల్ప్‌డెస్క్‌లు అందుబాటులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సత్యప్రసాద్, డీఆర్డీవో విద్యాచందన, పాలేరు నియోజకవర్గ ఆర్వో ఎం.రాజేశ్వరి, స్పెషల్ ఆఫీసర్ డీఎస్వో గంటా శ్రీలత, ఏసీపీ బస్వారెడ్డి, సర్పంచ్ ముల్కూరి శ్యాంసుందర్ రెడ్డి, ఎంపీఈవో రామచందర్‌రావు, ఇరిగేషన్ ఏఈ కోటేశ్వరరావు, ఏపీవో అప్పారావు, పంచాయతీ కార్యదర్శి మహమూదా పాల్గొన్నారు.

**దరఖాస్తులు ఎలా నింపుతున్నారు..?**

ప్రజలు దరఖాస్తులు ఎలా నింపుతున్నారు? సిబ్బంది వాటిని ఎలా స్వీకరిస్తున్నారు..? అనే అంశాలపై ప్రజాపాలన ఉమ్మడి జిల్లా నోడల్‌ఆఫీసర్ రఘునందన్‌రావు గైగొళ్లపల్లి గ్రామసభలో హెల్ప్‌డెస్క్ సిబ్బందిని ఆరా తీశారు. దరఖాస్తుదారులతో స్వయంగా మాట్లాడారు. ఎవరెవరు ఏయే గ్యారెంటీలకు దరఖాస్తు చేసుకున్నారో తెలుసుకున్నారు. డీఆర్డీవో విద్యాచందన, స్పెషల్ ఆఫీసర్ శ్రీలత, వ్యవసాయశాఖ అధికారి వాణితో పాటు ఇతర అధికారులకు సలహాలు సూచనలిచ్చారు. అధికారులు శుక్రవారం ఒక్కరోజే సుమారు 400 మంది నుంచి దరఖాస్తులు స్వీకరించామని నోడల్ ఆఫీసర్‌కు తెలిపారు.

### గ్రామసభల్లో నివృత్తి చేసే అధికారులు కరువు
### దరఖాస్తులను ఆన్‌లైన్ చేయని సిబ్బంది
### పథకాలు అందుతాయో.. లేదోననే అనుమానం

# సకలం సందేహాలే..

భద్రాద్రి కొత్తగూడెం, డిసెంబర్ 29 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయనున్న ఆరు గ్యారెంటీ పథకాలకు ప్రజలు దరఖాస్తు చేసుకునే విషయంలో వ్యక్తమవుతున్న సందేహాలను నివృత్తి చేయడంలో అధికారులు విఫలమవుతున్నారు. దరఖాస్తులోని అంశాలపై సదరు సిబ్బందికి కూడా అవగాహన లేకపోవడంతో దరఖాస్తులను స్వీకరిస్తూ రశీదు ఇచ్చి పంపేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా శుక్రవారం రెండో రోజు ప్రజాపాలన గ్రామసభలకు ఉదయం నుంచి ఎవరూ రాకపోవడంతో సభలు వెలవెలబోయాయి. 10 గంటల తర్వాత ప్రజలు దరఖాస్తులు సమర్పించడానికి గ్రామసభలకు వస్తున్నారు. కొన్ని గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీల్లో సిబ్బంది ఇళ్లకు వెళ్లి దరఖాస్తు ఫారాలు ఇవ్వగా.. మరికొందరు ప్రజలు గ్రామసభ వద్దే దరఖాస్తు ఫారాలు తీసుకుంటున్నారు. అయితే ఒకే ఇంట్లో అందరం కలిసి ఉంటున్నాం.. మాకు ఇల్లు లేదు.. ఏ ఇంటి నెంబర్ దరఖాస్తులో వేయాలనే ప్రశ్నలు ఉదయిస్తున్నాయి. కాగా.. దీనిపై అధికారులు పూర్తిస్థాయిలో స్పష్టత ఇవ్వకపోవడంతో దరఖాస్తుదారులు ఇబ్బంది పడుతున్నారు. అలాగే కౌలు రైతులు దరఖాస్తుల్లో పొలం సర్వే నెంబర్ ఎవరిది వేయాలనే దానిపై తేల్చుకోలేక సతమతమవుతున్నారు. ఒకవేళ భూస్వామిని అడిగితే.. అతడు సర్వే నెంబర్ చెప్పకపోగా.. మళ్లీ కౌలుకు ఇచ్చేది లేదని ముఖంపైనే చెప్పేస్తున్నారని పలువురు కౌలు రైతులు వాపోతున్నారు. అద్దె ఇంట్లో ఉంటే ఆ ఇంటి యజమాని తమ ఇంటి నెంబర్ దరఖాస్తుల్లో వేయొద్దని ముందుగానే చెబుతుండడంతో దరఖాస్తుదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**ఆన్‌లైన్ చేయని దరఖాస్తులు**

ఆరు గ్యారెంటీలకు దరఖాస్తులు తీసుకున్న మరుక్షణమే సంబంధిత అధికారులు ఆన్‌లైన్ చేయాలని ఇటీవల జరిగిన సమావేశంలో పై అధికారులు చెప్పినా ఆ తంతు ఎక్కడా కనిపించడం లేదు. గ్రామసభలు నిర్వహించే అధికారులను అడిగితే.. ఇంకా ఆన్‌లైన్‌పై స్పష్టత రాలేదని చెబుతున్నారు. ప్రజల నుంచి తీసుకున్న దరఖాస్తులన్నీ ఆన్‌లైన్ చేస్తారా.. లేదా.. కార్యాలయాల్లోనే కట్టలుగా పెడతారా.. అనే సందేహాలు దరఖాస్తుదారులకు కలుగుతున్నాయి.



చుంచుపల్లి మండలం బాబూక్యాంపు పంచాయతీలో దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎంపీపీ బాదావత్ శాంతి



లక్ష్మీదేవిపల్లి మండలం శ్రీనగర్ కాలనీలో దరఖాస్తు స్వీకరిస్తున్న జడ్పీ చైర్మన్ కంచర్ల

**గ్రామసభలను సందర్శించిన జెడ్పీ చైర్మన్ కంచర్ల**

సుజాతనగర్ మండలం సీతంపేట, లక్ష్మీదేవిపల్లి మండలం శ్రీనగర్ కాలనీల్లో ప్రజా పాలన గ్రామసభలను జడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖరరావు శుక్రవారం సందర్శించారు. ఆయన అధికారులతో మాట్లాడుతూ దరఖాస్తు విషయంలో ప్రజలకు ఎలాంటి సందేహాలు వచ్చినా వాటిని నివృత్తి చేయాలన్నారు. ప్రతి సమస్య పరిష్కారమయ్యేలా చూడాలన్నారు. కొన్ని కుటుంబాలు ఒకే ఇంట్లో ఉన్నా.. వేర్వేరుగా ఉంటున్నారని, వారికి వేర్వేరుగా దరఖాస్తులు ఇవ్వాలన్నారు.

**ఒకే ఇంట్లో మూడు కుటుంబాలు**



మూడు కుటుంబాలు ఒకే ఇంట్లో ఉంటున్నాం. అదే ఇంటి నెంబర్ వేస్తే సొంత ఇంటిలా చూస్తారు కదా.. ఎలా. మేం ఏ ఇంటి నెంబర్ వేయాలి? అసలు ఇంటి నెంబర్ వెయ్యక పోతే మాకు గృహలక్ష్మి వస్తుందా.. లేదా.. అనేది అర్థం కావడం లేదు. మగవాళ్ల పేరుతో కనెక్షన్ ఉంటే గ్యాస్ సబ్సిడీ వస్తుందా.. అనే దానిపై ఎవరూ స్పష్టత ఇవ్వడం లేదు.

*–రామగిరి రమణి, బాబూక్యాంపు, చుంచుపల్లి మండలం*

## దివ్య ప్రార్థనకు అనువైంది ధనుర్మాసం

**త్రిదండి దేవనాద రామానుజ జీయర్ స్వామి**



ప్రవచనాలు చెబుతున్న త్రిదండి దేవనాద రామానుజ జీయర్ స్వామి

ఖమ్మం, డిసెంబర్ 29 : ధనుర్మాసం అంటే.. దివ్య ప్రార్థనకు అనువైన మాసమని శ్రీశ్రీశ్రీ త్రిదండి దేవనాద రామానుజ జీయర్ స్వామి అన్నారు. ధనుర్మాసం పర్యటనలో భాగంగా శుక్రవారం ఖమ్మం కమాన్ బజార్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాన్ని దర్శించుకున్న ఆయన జడ్పీ సెంటర్ పొలాస్ వద్ద ధనుర్మాసం ప్రత్యేకత గురించి వివరించారు. ధనుర్మాస పుణ్యకాలంలో ఒక రోజు విష్ణుమూర్తిని పూజిస్తే వెయ్యేళ్లు విష్ణువును భక్తితో పూజించినట్లేనని అన్నారు. ధను అనగా.. దేని కొరకు ప్రార్థించడమో అనే అర్థం దృష్ట్యా ధనుర్మాసం అత్యంత పునీతమైనదని వివరించారు. ధనుర్మాసం తెలుగు సంస్కృతిలో ఒక భాగమని, దేవాలయాల్లో జరిగే ఆగమ విహిత కైంకర్యాలలో స్థానిక ఆచార వ్యవహారాలు, ఇతర సంప్రదాయాలు కలగలిసిన అంశాల్లో ధనుర్మాసం ఒకటని పేర్కొన్నారు. తిరుమలలో ధనుర్మాసం నెల రోజులపాటు సుప్రభాతం బదులు తిరుప్పావై గానం చేస్తారని, సహస్రనామార్చనలో తులసీ దళాలకు బదులు బిల్వపత్రాలను ఉపయోగిస్తారని వివరించారు. భక్తులు భగవంతుని వైపు విశ్వాసం ఉంచి జీవితాన్ని కొనసాగించాలని, అప్పుడు మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. కార్యక్రమంలో వికాస తరంగిణి జిల్లా అధ్యక్షుడు పోలా శ్రీనివాస్, మధుసూదనరావు, యాదగిరి, వెంకటనారాయణ, పావని, నర్మద, ఉషాకన్య, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల ఖర్చు వివరాలు అందజేయాలి

**వ్యయ పరిశీలకులు సంజీబ్ కుమార్ పాల్, అజయ్‌లాల్ చంద్ సోనేజీ**



మాట్లాడుతున్న ఎన్నికల వ్యయ పరిశీలకులు

భద్రాద్రి కొత్తగూడెం, డిసెంబర్ 29 (నమస్తే తెలంగాణ) : ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులందరూ విధిగా తమ ఎన్నికల ఖర్చు వివరాలను ఎన్నికల కమిషన్‌కు అందజేయాలని వ్యయ పరిశీలకులు సంజీబ్‌కుమార్ పాల్, అజయ్ లాల్‌చంద్ సోనేజీ అన్నారు. శుక్రవారం ఐడీవోసీ సమావేశ మందిరంలో జిల్లాలోని ఐదు నియోజకవర్గాల ఏఈవోలు, శాసనసభ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులతో ఎన్నికల ఖర్చు వివరాలు అందజేసే అంశంపై వ్యయ పరిశీలకులు సమీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులందరూ తాము చేసిన ఖర్చు వివరాలను బ్యాంకు బుక్, డే టూ డే రిజిస్టర్, క్యాష్ బుక్‌లలో నమోదు చేయాలన్నారు. ఖర్చుల నివేదికలను ఎన్నికల వ్యయ అధికారులకు ఈ నెల 31వ తేదీ లోపు సమర్పించి రీ కన్సిలేషన్ చేయించి క్లియరెన్స్ సర్టిఫికెట్ తీసుకోవాలన్నారు. గడువులోగా నివేదికలు సమర్పించని అభ్యర్థులపై ఎన్నికల సంఘం నియమావళిని అనుసరించి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సహకార అధికారి, ఎన్నికల వ్యయ నోడల్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, ఆడిట్ అధికారి వెంకటేశ్వరరెడ్డి, లైజన్ ఆఫీసర్లు సంజీవరావు, సీతారాం తదితరులు పాల్గొన్నారు.

## రామయ్యకు పట్టాభిషేకం



రామయ్యకు పట్టాభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం, డిసెంబర్ 29 : భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానంలో డిసెంబర్ 1న ప్రారంభమైన శ్రీరామ పునర్వసు దీక్షలు గురువారంతో ముగిశాయి. శుక్రవారం పుష్యమి నక్షత్రం సందర్భంగా శ్రీరామదీక్షాపరులతో స్వామివారికి ఘనంగా పట్టాభిషేకం నిర్వహించారు. నిత్య కల్యాణం అనంతరం అదే వేదికపై రామయ్య తండ్రికి పట్టాభిషేక మహోత్సవం జరిపారు. వేదపండితుల వేద మంత్రోచ్ఛారణలు, మంగళ వాయిద్యాలు, మేళతాళాల నడుమ స్వామివారి పట్టాభిషేకం కార్యక్రమం నేత్రపర్వంగా సాగింది. ముందుగా విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచన జరిపి.. పట్టాభిషేకంలో వినియోగించే ద్రవ్యాలకు పుణ్య జలాలతో సంప్రోక్షణ చేశారు. పవిత్ర పుణ్య నదీ జలాలతో స్వామివారికి అభిషేకం నిర్వహించారు. తర్వాత అష్టోత్తర, సహస్ర నామార్చన, సువర్ణ పుష్పార్చనలతో స్వామివారిని అర్చించారు. అనంతరం స్వామివారిని సింహాసనంపై రామయ్యను పట్టాభిషిక్తుడిని చేశారు. భక్త రామదాసు తయారు చేయించిన దివ్యాభరణాలను రామయ్యకు ధరింపజేశారు. ఒక్కో ఆభరణాన్ని భక్తులకు చూపించి.. దాని విశిష్టతను భక్తులకు వివరించారు. ఈ సందర్భంగా పట్టాభిషేక స్వర్గను పఠించారు. అనంతరం భక్తులపై పుణ్య నదీ జలాలను సంప్రోక్షించారు. కార్యక్రమంలో గోపాల కృష్ణమాచార్యులు, కోటి శ్రీమన్నారాయణాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

## రెండో రోజుకు చేరిన రాష్ట్రస్థాయి క్రీడలు

**వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరుస్తున్న జట్లు**



కబడ్డీలో తలపడుతున్న క్రీడాకారిణులు

ఇల్లెందు రూరల్, డిసెంబర్ 29 : సుదిమల్ల గిరిజన గురుకుల బాలికల కళాశాలలో నిర్వహిస్తున్న తెలంగాణ ఏడవ రాష్ట్రస్థాయి గిరిజన గురుకుల బాలికల క్రీడా పోటీలు శుక్రవారం రెండో రోజుకు చేరాయి. జోన్‌లవారీగా నిర్వహిస్తున్న పోటీల్లో క్రీడాకారిణులు తమ క్రీడా ప్రతిభను ప్రదర్శిస్తున్నారు. ఉమ్మడి జిల్లా రీజినల్ కోఆర్డినేటర్ టి.వెంకటేశ్వరరాజు, ప్రిన్సిపాల్ అరుణకుమారి, క్రీడా కోఆర్డినేటర్ జి.మాధవి క్రీడా పోటీల వివరాలను వెల్లడించారు. అండర్-19 జోన్-3 ఖోఖో విభాగం ఫైనల్స్‌లో అంకంపాలెం బాలికల కళాశాల ప్రథమ, జోన్-3 సెలక్షన్ టీం ద్వితీయ స్థానంలో నిలిచింది. అండర్-19 కబడ్డీ విభాగంలో జోన్-1, 2 జట్లు తలపడగా.. జోన్-2 జట్టు విజయం సాధించింది. అండర్-17 బాల్ బ్యాడ్మింటన్ విభాగంలో జోన్-4 చెందిన విన్నర్, రన్నర్ జట్లు ఫైనల్స్‌కు చేరాయి. అండర్-14 హ్యాండ్‌బాల్ విభాగంలో జోన్-1, 2 జట్లు తలపడగా.. జోన్-1 విజేతగా నిలిచింది. అండర్-19 అథ్లెటిక్స్ విభాగంలో జోన్-3కి చెందిన టి.శ్రీతేజ 100 మీటర్లు, 400 మీటర్లు, షాట్‌పుట్ విభాగంలో పద్మ ప్రథమ బహుమతి సాధించింది. అండర్-17 విభాగంలో జోన్-3 క్రీడాకారిణి పి.ఇందు 100 మీటర్లు, డిస్కస్ త్రోలో ప్రథమ, 400 మీటర్ల విభాగంలో ద్వితీయ బహుమతి సాధించింది. అండర్-14 విభాగంలో జోన్-3 క్రీడాకారిణి జె.సాత్విక 100 మీటర్లు షాట్‌పుట్, డిస్కస్‌త్రోలో ప్రథమ, 400 మీటర్ల విభాగంలో ద్వితీయ బహుమతి సాధించింది. కాగా.. ముఖ్యఅతిథిగా హాజరైన గురుకుల స్పోర్ట్స్ అధికారి రవికుమార్ క్రీడాకారిణులు కనబరుస్తున్న ప్రతిభను పరిశీలించారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలు, కళాశాలలకు చెందిన ప్రిన్సిపాళ్లు, గిరిజన గురుకుల బాలికల జూనియర్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ షాజహాన్, వైస్ ప్రిన్సిపాల్ కవిత, పీడీలు, పీఈటీలు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు పథకాలు అందించాలి

**కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని**



దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే కూనంనేని

పాల్వంచ, డిసెంబర్ 29 : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీ పథకాలు ప్రతీ పేదవారికి అందించాలని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. పాల్వంచ మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డు గాంధీనగర్‌లో శుక్రవారం జరిగిన ప్రజా పాలన వార్డు సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మి, రైతు భరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, చేయూత పథకాలతో పేదల స్థితిగతులు మారతాయని అన్నారు. ప్రభుత్వ పథకాల అమలులో ఎలాంటి పైరవీలకు తావుండబోదని, ప్రజలు నేరుగా అధికారులను సంప్రదించి తమ అనుమానాలను నివృత్తి చేసుకోవాలన్నారు. గ్రామ, వార్డు సభలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ స్వామి, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, మున్సిపల్ డీఈ, ఏఈ, శానిటరీ ఇన్‌స్పెక్టర్, సీపీఐ నాయకులు ముత్యాల విశ్వనాథం, వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, ఉప్పుశెట్టి రాహుల్, గుండాల నాగరాజు, అన్నారపు వెంకటేశ్వర్లు, ఎస్కే పాషా, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రసవత్తరంగా క్రికెట్ పోటీలు

భద్రాచలం, డిసెంబర్ 29 : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో 28వ నెహ్రూ కప్(తాళ్లూరి భారతీదేవి స్మారక) అంతర్రాష్ట్ర క్రికెట్ పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. శుక్రవారం జరిగిన మాచ్‌లలో న్యూ స్టార్ కొత్తగూడెం, బెస్ట్ క్రికెట్ అకాడమీ భద్రాచలం జట్టు, ఛేజింగ్ లెవన్ పాల్వంచ జట్లు గెలుపొందాయి. ఉదయం జరిగిన మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన ఎస్ఆర్ లెవన్ జట్టు 15 ఓవర్లలో 87 పరుగులు చేయగా.. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన న్యూ స్టార్ కొత్తగూడెం జట్టు కేవలం 10 ఓవర్లలో మూడు వికెట్లకు 91 పరుగులు చేసి గెలుపొందింది. మధ్యాహ్నం జరిగిన రెండో మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన ఏఎన్‌సీ జట్టు 15 ఓవర్లకు 65 పరుగులు చేయగా.. బెస్ట్ క్రికెట్ అకాడమీ జట్టు 10.3 ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి 66 పరుగులు సాధించి గెలుపొందింది. సాయంత్రం జరిగిన మూడో మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన ప్రతాప్ లెవన్ జట్టు 15 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 76 పరుగులు చేయగా.. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన పాల్వంచ జట్టు కేవలం 7.4 ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి విజయం సాధించింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికైన ఈశ్వర్‌కు నెహ్రూ కప్ వ్యవస్థాపకుడు బాలయోగి మెమొంటోను అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు నాగార్జున, ఎస్కే సలీం, గుమ్మూలూరి శ్రీనివాస్, కుంచాల సదానందం, ఎస్కే అజీమ్, తిరుమలరావు, చందు, గోపి, పాషా తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర సర్వీసులకు ఖమ్మం సీపీ

మామిళ్లగూడెం, డిసెంబర్ 29 : ఖమ్మం పోలీస్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న సీపీ విష్ణు ఎస్ వారియర్ కేంద్ర సర్వీసులకు వెళ్లనున్నారు. మూడేళ్లుగా ఖమ్మం పోలీస్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న వారియర్‌ను ఐదేళ్లపాటు కేంద్ర సర్వీసులో డిప్యూటేషన్ పద్ధతిపై విధులు నిర్వహించేందుకు కేంద్ర హోంశాఖ ఈ నెల 20వ తేదీన ఉత్తర్వులు జారీ చేసింది. 2013 తెలంగాణ కేడర్‌కు చెందిన ఐపీఎస్ అధికారి వారియర్‌ను వెంటనే తెలంగాణలో విధుల నుంచి రిలీవ్ చేసి.. కేంద్ర హోం శాఖలో రిపోర్టు చేసే విధంగా ఉత్తర్వులు జారీ చేయాలని కేంద్ర హోం శాఖ నుంచి తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారికి లేఖ అందింది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం తీసుకునే నిర్ణయం మేరకు వారియర్ కేంద్ర సర్వీసులో తన సేవలు అందించనున్నారు. సీపీగా ఇక్కడి నుంచి రిలీవ్ అయిన తర్వాత ఖమ్మం పోలీస్ కమిషనర్‌గా నూతన సీపీని ప్రభుత్వం నియమించనున్నది.

## 9, 11 తేదీల్లో బీఆర్ఎస్ పార్లమెంటు నియోజకవర్గ సమావేశాలు

ఖమ్మం, డిసెంబర్ 29: జనవరి 9, 11 తేదీల్లో హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఖమ్మం, మహబూబాబాద్ పార్లమెంటు నియోజకవర్గాల సన్నాహక సమావేశాలను బీఆర్ఎస్ నిర్వహించనుంది. 9న ఖమ్మం, 11 మహబూబాబాద్ పార్లమెంటు నియోజకవర్గాల వారీగా జరుగనున్న ఈ సమావేశాలకు పార్టీ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు వెళ్లనున్నారు. రానున్న పార్లమెంటు ఎన్నికల కోసం పూర్తిస్థాయిలో సమాయత్తమయ్యేందుకు పార్టీ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు ఆ పార్టీ నేతలు ఈ సమావేశాలు నిర్వహించనున్నారు.

## ఖమ్మం జిల్లాలో తగ్గిన నేరాలు

**2023 క్రైమ్ వార్షిక నివేదికను విడుదల చేసిన సీపీ విష్ణు ఎస్ వారియర్**

మామిళ్లగూడెం, డిసెంబర్ 29 : ఖమ్మం జిల్లా వార్షిక క్రైమ్ నివేదికను ఖమ్మం పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్ వారియర్ శుక్రవారం విడుదల చేశారు. జిల్లాలో గతేడాది కంటే దొంగతనాలు, మోసాలు తగ్గాయని నివేదికలో పేర్కొన్నారు. గతేడాది 595 దొంగతనాల కేసులు నమోదు కాగా ఈ ఏడాది 466 కేసులు నమోదయ్యాయని, ఆయా కేసుల్లో రూ.4.4 కోట్ల మేర నష్టం జరగగా పోగొట్టుకున్న సొత్తులో 35శాతం రికవరీ చేసినట్లు తెలిపారు. చీటింగ్ కేసులు 211 నమోదు కాగా ఈ ఏడాది 187 కేసులు నమోదయ్యాయని, 41 గంజాయి కేసుల్లో 86మందిని అరెస్టు చేసి కోటి ముప్పై లక్షల విలువ చేసే 872 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. సైబర్ నేరాల విభాగంలో తొమ్మిది కోట్లకు పైగా నేరగాళ్లు దోచుకున్నట్లు 1,332 ఫిర్యాదులు అందాయన్నారు. ఈ ఏడాదిలో 589 రోడ్డు ప్రమాదాలు జరగగా 233 మృతి చెందగా 648 మందికి గాయాలైనట్లు తెలిపారు.

శాంతిభద్రతల పరిరక్షణలో పకడ్బందీ వ్యూహంతో జిల్లా పోలీస్ యంత్రాంగం కష్టపడి పని చేసింది. జిల్లాలో జరిగిన జాతరలు, వరదలు, పండుగలు, ర్యాలీలు, సభలు, ఎన్నికలు, అన్ని రకాల కార్యక్రమాలకు సమర్థవంతమైన భద్రతను ఏర్పాటుచేసి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా చూశారు. రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా బ్లాక్ స్పాట్లను గుర్తించిన ప్రదేశాల్లో లోపాలను సరిదిద్ది సిగ్నల్‌లైట్లు, బారికేడ్ల వినియోగం, రేడియం స్టిక్కర్లతో ప్రభావవంతమైన సైన్‌బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసి సమర్థవంతంగా అమలు చేశారు. విద్యా సంస్థల్లో అవగాహన కార్యక్రమాలు, మద్యం తాగి వాహనాలు నడిపే వారికి కౌన్సెలింగ్, హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేకంగా డ్రైవ్ నిర్వహించారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు జాబ్‌మేళా వేదికగా అద్భుతమైన అవకాశం కల్పించి 150 కంపెనీలలో 8,200 ఉద్యోగ, ఉపాధి కల్పించారు. పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో అర్హులైన 500 మంది యువతకు ప్రత్యేక శిక్షణ, అనుభవజ్ఞులైన ఫ్యాకల్టీలతో పకడ్బందీగా శిక్షణ ఇచ్చి ప్రతి ఒక్కరిలో ప్రతిభాపాటవాలు నింపి ఉద్యోగాన్ని సాధిస్తామనే ఆత్మస్థైర్యాన్ని పెంపొందించారు.

**వార్షిక నివేదికలో నేరాలు**

| కేసుల కేటగిరీ | 2022 | 2023 |
|---|---|---|
| దొంగతనాలు | 595 | 466 |
| చీటింగ్ కేసులు | 211 | 187 |
| గంజాయి కేసులు | 41 | 41 |
| సైబర్ నేరాలు | 1,249 | 1332 |
| హత్యలు | 25 | 28 |
| రేప్ కేసులు | 54 | 56 |
| కిడ్నాప్‌లు | 83 | 84 |
| రోడ్డు ప్రమాదాలు | 192 | 213 |
| రోడ్డు ప్రమాదాల్లో మృతి | 207 | 233 |
| హత్యాయత్నాలు | 43 | 45 |
| మొత్తం ఎఫ్ఐఆర్స్ నమోదు | 7,304 | 6,894 |

(ఈ ఏడాది 47శాతం నేరస్తులకు శిక్షలు)